క్లుప్తంగా

వెలగదుర్రులో విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా హోమం చేస్తున్న వేద పండితులు

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు గ్రామ ఎస్సీ ఏరియాలోని రామాలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ వేడుకను ఆదివారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేదుల వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆలయం వద్ద ఏకాహం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం నిర్వాహకులు పోలుమాటి చిన్న, చోళ్ల శ్రీనివాసు, పోలుమాటి రాజేష్, యాళ్ల శ్రీను, కొలుకుల రాజేష్, బడుగు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బంకుల్లో విడిగా పెట్రోలు అమ్మకాల నిషేధం

ఉండ్రాజవరం: పెట్రోల్ బంకుల్లో విడిగా టిన్నులు, డ్రమ్ములు, బాటిళ్లలో పెట్రోల్ విక్రయాలను ప్రభుత్వం నిషేధించిందని స్థానిక ఎస్సై వి.అప్పలరాజు ఆదివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న ఘర్షణలు, హింసాయుత ఘటనలను దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మండలంలోని పెట్రోలు, డీజిల్ బంకుల యాజమానులు జిల్లా అధికారుల ఉత్తర్వులను విధిగా పాటించాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లోని బడ్డీ కొట్ల వద్ద బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ అమ్మడం నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ మండలంలో అన్ని రకాల బాణసంచా తయారీ, హోల్‌సేల్ దుకాణాల్లో బాణసంచా సామగ్రి విక్రయాలను నిషేధించడం జరిగిందన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు అమర్చిన, తీసి వేసిన మోటార్ సైకిళ్లపై రోడ్లపై తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు.

'పుచ్చలపల్లి' చిరస్మరణీయుడు

కొవ్వూరు: కార్మిక, కర్షక రాజ్య స్థాపనకు జీవింతాంతం పోరాడిన స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య చిరస్మరణీయుడని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్ర పటానికి సుందరబాబు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్మిక, కర్షక వర్గాలకు ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుకూరి దొరయ్య, బీరా రవి, మానికిరెడ్డి హరిబాబు, ఎం.జ్యోతిబసు, రేఖా నాగేశ్వరరావు, ఎం.సాగర్, మల్లేశ్వరరావు, ఎం.ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కొవ్వూరు: జాతీయ రహదారిపై మండలంలోని నందమూరు జగనన్న కాలనీ సమీపంలో ఆదివారం మోటార్ సైకిల్‌ను ఐషర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో కొవ్వూరుకు చెందిన కల్లిప పూర్ణ సాయికార్తీక్ (21) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న కరగాని గణేష్, కురందాసు దుర్గలు తీవ్రంగా గాయపడ్డారని కొవ్వూరు రూరల్ ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయి కార్తీక్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన వాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. సాయికార్తీక్ తన ఇద్దరు మిత్రులు గణేష్,దుర్గలతో కలసి బైక్‌పై గౌరీపట్నం ఫంక్షన్‌కు వెళుతూ ఈ ప్రమాదం బారిన పడ్డాడు.

భార్య ఫిర్యాదుపై కేసు నమోదు

కొవ్వూరు: తన భర్త విజయ్‌కుమార్ తనను శారీరకంగానూ, మానసికంగానూ వేధిస్తున్నట్టు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సానా దేవి అనే వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు ఆదివారం అతడిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు తెలిపారు. మూడు నెలల క్రితమే తమకు వివాహం అయ్యిందని, కొన్నాళ్లు సాఫీగానే సాగిందని దేవి తన ఫిర్యాదులో పేర్కొంది. ఇటీవల తనను భర్త వేధిస్తున్నట్టు ఆమె పేర్కొంది.

మహిళ అదృశ్యం

కొవ్వూరు: తన తల్లి సుంకర శ్రీదుర్గ ఈనెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ పట్టణానికి చెందిన సుంకర పావని అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై ఎండీ జుబేర్ తెలిపారు. తన తల్లికి చాలాకాలంగా శారీరక, మానసిక ఆ రోగ్యం సరిగా లేదని ఆమె పేర్కొంది. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె పేర్కొంది.



అన్నవరప్పాడులో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారు



చాగల్లులో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితుడు

కమనీయం.. వేంకటేశ్వరుని కల్యాణం

- శాస్త్రోక్తంగా అన్నవరప్పాడు వెంకన్న కల్యాణం
- భారీగా తరలి వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న కోలాటం

పెరవలి: వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆదివారం తెల్లవారుజాము నాలుగు గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, నిత్యార్చన అలంకరణ అనంతరం భక్తుల సర్వ దర్శనానికి అనుమతించారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేక వేదికపై అఖండ శ్రీరామ నామ సంకీర్తన ప్రారంభించారు. మధ్యాహ్నం స్వామి వారికి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. కల్యాణం సందర్భంగా పంతం ఆదినారాయణ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారికి వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు జరిపించారు. పురోహితుల వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా ఈ వేడుక జరిగింది. భారీగా తరలి వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా శ్రీ భక్తాంజనేయ కోలాట భజన బృందం ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడింది. చిన్నారులు, పెద్దలు కలిసి చేసిన ఈ కోలాటం చూపరులను ఆకట్టుకుంది. స్వామివారి భక్తి గీతాలు ఆలపిస్తూ చేసిన నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి.



అన్నవరప్పాడులో ఎదుర్కోలు ఉత్సవంలో వేంకటేశ్వరస్వామి పట్టు వస్త్రాలకు పూజలు

స్వామి ఉత్సవాలు ప్రారంభం

వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం వేంకటేశ్వరస్వామివారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామునే వందలాది మంది భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో పురోహితులు సుందరంగా అలకంరించారు. ఉదయం 10 గంటల నుంచి భక్తులకు అన్న సమారాధన చేశారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

చాగల్లులో..

చాగల్లు: స్థానిక ప్రధాన కూడలిలోని అలివేలు మంగా పద్మా సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణాన్ని ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. డాక్టర్ ఆలపాటి సాంబశివరావు దంపతుల చేతుల మీదుగా నిర్వహించిన ఈ కల్యాణ వేడుకను అధిక సంఖ్యలో గ్రామస్తులు తిలకించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 26న ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఆరోగ్య సంరక్షణలో వైద్యుల పాత్ర కీలకం



నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరరావు, సిరాజుద్దీన్

నల్లజర్ల: సమాజ శ్రేయస్సులో కుటుంబ వైద్యుల పాత్ర కీలకమని, వారి సేవలను గుర్తించి గౌరవించే లక్ష్యంతో ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్స్ డే నిర్వహిస్తున్నట్టు నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యులు తెల్లం గంగాధరరావు, సిరాజుద్దీన్ అన్నారు. ఏటా మే 19న నిర్వహించే డాక్టర్స్ డే విశిష్టతను వారు వివరించారు. ప్రాథమిక వైద్య సేవల ద్వారా గుర్తించి, సకాలంలో చికిత్స అందిస్తే ఆసుపత్రులకు వెళ్ళకుండానే 90 శాతం వ్యాధులు నయం అవుతాయన్నారు. ప్రాథమిక వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కేంద్రంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ ఇద్దరు చొప్పున డాక్టర్లను నియమించిందన్నారు. పీహెచ్‌సీలో ఒకరు సేవలు అందిస్తే, మరొకరు గ్రామాల్లోని హెల్త్ సెంటర్లకు వెళ్లి ఆ ప్రాంత గ్రామీణులకు ప్రతి 15 రోజుల కొకసారి నేరుగా వైద్యసేవలు అందించడం అద్భుతమైన విషయం అన్నారు.

ఉచితంగా సుగర్ పరీక్షలు

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సుగర్ పరీక్షలు నిర్వహించారు. స్థానిక రోటరీ సెంట్రల్ వృద్ధాశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్‌గౌడ్, బూరుగుపల్లి సత్యనారాయణ, బండి వేణుగోపాలకృష్ణ, బీఎస్‌వీ ప్రసాద్, నీరుకొండ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకే తనిఖీలు

- తీపర్రు ర్యాంపు నుంచి కోనసీమ జిల్లా ఇసుక తరలింపు
- ఆ జిల్లా కలెక్టర్‌తో 'తూర్పు' కలెక్టర్ ఫోన్‌లో సంభాషణ
- ఇక్కడి నుంచి ఇసుకను తరలించనీయవద్దని ఆదేశాలు
- జిల్లాలోని పలు ఇసుక ర్యాంపులను పరిశీలించిన మాధవీలత



తీపర్రు ఇసుక ర్యాంపులో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మాధవీలత



తాళ్లపూడి మండలం బల్లిపాడు ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

పెరవలి: హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి, జిల్లాలో సాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదికలు ఇవ్వవలసి ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. వర్షంలో తడుస్తూనే ఆదివారం ఆమె మండలంలోని తీపర్రు ఇసుక ర్యాంపులో తవ్వకాలు జరిగిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఇసుక ర్యాంపుల నిర్వహణపై ఒక వైపు ఫిర్యాదులు వచ్చినందున, మరో వైపు కోర్టు ఆదేశాల ఉన్నందున ర్యాంపులపై దాడులు, తవ్వకాలు జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. తీపర్రు ఇసుక ర్యాంపులో జరిగిన ఇసుక తవ్వకాలు తూర్పుగోదావరి జిల్లా పరిధిలోనివి కాదని, ఆ తవ్వకాలన్నీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోకి వస్తాయని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. ఫిర్యాదుదారులు ఎవరైన వస్తే తమ పరిధి కాదని ఖరాఖండిగా చెప్పాలని జిల్లా అధికారులకు ఆమె సూచించారు. అదే సమయంలో తీపర్రు ఇసుక ర్యాంపు నుంచి ఎలాంటి వాహనాల రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్‌లో నేరుగా మాట్లాడారు. ఇసుక తవ్వకాలన్నీ మీ జిల్లా పరిధిలో జరిగాయని, కేవలం వాహనాలు మాత్రం తీపర్రు ఇసుక ర్యాంపు నుంచి వెళుతున్నాయని ఆ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తీపర్రు ర్యాంపు నుంచి కోనసీమ జిల్లా పరిధిలోని ఇసుకను తరలించకుండా నివారించాలని ఆ జిల్లా కలెక్టర్ ఫోన్‌లో మాధవీలతను కోరారు. అనంతరం అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి, కొవ్వూరు సబ్ కలెక్టర్‌కు వెంటనే కలెక్టర్ మాధవీలత స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎవరైనా చాటుగా తీసుకెళితే కేసులు నమోదు చేసి, బాధ్యులను అరెస్టు చేయాలని పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, గోదావరి కన్జర్వెన్సీ అధికారులను ఆదేశించారు. ఇకపై తీపర్రు ర్యాంపు నుంచి ఇసుక లారీలు వెళితే అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కాగా తీపర్రు ఇసుక ర్యాంపులో ఇటీవల అధికారులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు పొక్లెయిన్లు, నాలుగు లారీలను సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వాహనాలన్నీ ఇప్పటికీ ఆ ర్యాంపులోనే ఉండడాన్ని గమనించిన కలెక్టర్ మాధవీలత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ వాహనాలను పెరవలి పోలీసు స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. అనంతరం ఆమె మండలంలోని కానూరు పెండ్యాల ఇసుక ర్యాంపును కూడా సందర్శించారు. ఇటీవల ఈ ర్యాంపు వద్ద కూడా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ పర్యటనలో గనుల శాఖ ఏజీ విఘ్నేష్, మైన్స్ ఏడీఏ సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ అధికారి ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తహసీల్దార్ డి.సుధ, ఎస్ఐ ఏజీఎస్ మూర్తి పాల్గొన్నారు.

బల్లిపాడులో..

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడు వేగేశ్వరపురం సమీపంలోని గోదావరి ఇసుక రీచ్‌లను అధికారులతో కలిసి కలెక్టర్ మాధవీలత ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంతెనలకు 500 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలు జరపరాదన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా ఇంజినీరింగ్ అధికారులు రోజూ పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు. బోట్స్‌మన్ సొసైటీ వారు కూడా గోదావరిలో డ్రెడ్జింగ్ చేయకూడదన్నారు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను బోట్స్‌మన్ సొసైటీ ద్వారా విక్రయించుకునే వాహనాలపై రవాణా చేసే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ వెంట కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ అధికారి వి.సోమశేఖర్, గ్రౌండ్ వాటర్ డీడీ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఇరిగేషన్ అధికారి ఆర్.కాశీ విశ్వేశ్వర రావు తదితరులు ఉన్నారు.

కొవ్వూరు మండలంలో..

కొవ్వూరు: ఇసుక తవ్వకాలపై ఫిర్యాదులు వస్తున్నందున కలెక్టర్ కె.మాధవీలత ఆధ్వర్యంలోని జిల్లా సమన్వయ కమిటీ అధికారులు బృందం ఆదివారం ఇసుక ర్యాంపులను పరిశీలించింది. ఓపెన్ రీచ్‌లు, బోట్స్‌మెన్ సొసైటీల ర్యాంపులు, డ్రెడ్జింగ్ పనులపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ర్యాంపులను తనిఖీ చేసినట్టు ఆమె తెలిపారు.పెరవలి, నిడదవోలు, తాళ్లపూడి, కొవ్వూరు, కడియం మండలాల్లోని ఇసుక ర్యాంపులను తనిఖీ చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. కొవ్వూరు మండలంలో కుమారదేవం, చిడిపి, నిడదవోలు మండలంలో పందలపర్రు ర్యాంపులను తనిఖీ చేశారు.

మామిడి అధరహో..

- సామాన్యుడికి అందుబాటులో లేని మధుర ఫలం
- రకాన్ని బట్టి రూ.20 నుంచి రూ.30 వరకూ పలుకుతున్న ధర



తాళ్లపూడిలో విక్రయిస్తున్న మామిడి పండ్లు

తాళ్లపూడి: వేసవిలో మాత్రమే లభించే మధుర ఫలం మామిడి. మామిడి పండును ప్రజలు ఇష్టంగా తింటారు. అయితే రేటు ఎక్కువగా ఉండడంతో సామాన్యుడు దాని వైపు కన్నెత్తి చూడలేక పోతున్నాడు. ఇటీవల మామిడి పండ్లను కృత్రిమ రసాయనాలతో మగ్గిస్తున్నారు. దీంతో రుచి అంతగా ఉండడం లేదని కూడా పలువురు అంటున్నారు. ఈ ఏడాది మామిడి దిగుబడులు తగ్గడంతో ధరలు చుక్కల్లోకి చేరాయి. పైగా కాసిన కొద్దిపాటి కాయలు ఈదురు గాలులకు చెట్ల నుంచి నేల రాలుతున్నాయి. ఒక్కో మామిడి పండును రూ. 20 నుంచి రూ.30 ధరకు విక్రయిస్తున్నారు. పరక (13 కాయలు) ధర రకాన్ని బట్టి, వాటి సైజును బట్టి రూ.250 నుంచి రూ.350 వరకూ ధర పలుకుతోంది. ప్రజలు ఇష్టంగా తినే చెరకు రసాలు సైజును బట్టి రూ.250 నుంచి రూ.300 వరకూ వ్యాపారులు అమ్ముతున్నారు. బంగినపల్లి రూ.200 నుంచి రూ.250, పంచదార కలశ రూ.250 నుంచి రూ.300, సువర్ణరేఖ రూ.250 వరకూ ధర పలుకుతున్నాయి. ఇతర రకాల పండ్ల ధరలు కూడా ఇదే రీతిలో ఉన్నాయి. ధర పెరిగినా కూడా మామిడిపండ్ల ప్రియులు మాత్రం ఇష్టంగా కొనుగోలు చేసి తీసుకు వెళుతున్నారు.

కన్నుల పండువగా మదన గోపాలుని కల్యాణం



నిడదవోలులో శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీమదన గోపాలస్వామివారు కల్యాణం



దేవరపల్లి మండలం యర్నగూడెంలో మదన గోపాలస్వామి వారి కల్యాణం

నిడదవోలు: పట్టణంలోని మదన గోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకుడు గోవర్ధనం దుర్గాప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రాల నడుమ కనుల పండువగా కల్యాణం సాగింది. పట్టణ నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ వేడుకను తిలకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం స్వామి, అమ్మవార్లకు సహస్రనామ పూజలు నిర్వహిస్తారు. మదన గోపాలస్వామి వారి మహిళా భజనమండలి సభ్యులు విష్ణు, లక్ష్మీ సహస్రనామ పారాయణం, అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తారు. అలాగే గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈనెల 21న స్వామి, అమ్మవార్లకు సహస్ర నామ పూజలు జరుగుతాయి. కూచిపూడి నాట్య మండలి కళాకారులు భరతనాట్య ప్రదర్శన చేస్తారు. 23న అన్నమాచార్య సంకీర్తనలు, స్వామి వారి పుష్ప యాగోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు తెలిపారు.

యర్నగూడెంలో..

దేవరపల్లి: యర్నగూడెంలోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి కల్యాణాన్ని ఆదివారం వైభంగా నిర్వహించారు. కొయ్యలమూడి నాగేశ్వరరావు, లావణ్య దంపతులు, నరహరిశెట్టి భూషణం, ఆదిలక్ష్మి దంపతుల చేతులమీదుగా స్వామి వారి కల్యాణం జరిగింది. అర్చకుడు పార్థసారధి కల్యాణాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ హైస్కూల్ 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ సందడి చేశారు.యర్నగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్లో వారంతా కలుసుకున్నారు. అలనాటి తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కుటుంబ సభ్యులను ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో యర్నగూడెం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కోతులకు ఆహారం అందజేత

నల్లజర్ల: దూబచర్ల–జి.కొత్తపల్లి మధ్య గల అటవీ ప్రాంతంలోని కోతులు ఆహారం లేక విలవిల్లాడుతున్నాయి. ఈ విషయం గమనించిన పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు, ఏలూరు జిల్లా గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంబటి గురుమూర్తి దంపతులు ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లి కోతులకు ఆహారం(పండ్లు, కాయలు) అందజేశారు.

వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు

నల్లజర్ల: వ్యవసాయం లాభసాటి కావాలంటే నేల, నీటి సంరక్షణకు రైతులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ సూచిస్తున్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల నేల స్థితిగతులు దెబ్బతింటున్నాయన్నారు. తద్వారా దిగుబడులు తగ్గడం, పెట్టుబడులు పెరగడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. భూసారం, పంట దిగుబడులు పెంచుకోవాలంటే రైతులు ముందస్తు యాజమాన్య చర్యలు పాటించాలని కమల్‌రాజ్ పేర్కొన్నారు.

వాలుకు అడ్డంగా లో దుక్కులు

వర్షపు నీటిని ఎక్కడికక్కడ భూమిలో ఇంకించుకోవాలంటే నేల పైపొర కొట్టుకు పోకుండా భూసారాన్ని పెంచుకునేలా పొలాల్లో వాలుగా ఉన్న ప్రాంతానికి అడ్డంగా సేద్యపు పనులు చేపట్టాలన్నారు. ఈ వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గత పంటల అవశేషాలతో పాటు చీడపీడలు, తెగుళ్ల ఆశించిన పొల్లాల్లో వాటి లక్షణాలు అలానే ఉండిపోతాయన్నారు. లోతుగా దుక్కులు చేయడం ద్వారా క్రిమి కీటకాలు, వాటి గుడ్లు బయటకు వచ్చి ఎండలకు నశిస్తాయన్నారు. దీనివల్ల తర్వాత పంటలను సోకే వివిధ రకాల చీడపీడలను ముందుగానే అరికట్టవచ్చన్నారు. మొవ్వ కుళ్లు, పల్లాకు తెగులు, గులాబీరంగు కాయతొలుచు పురుగు లాంటి ప్రమాదకర తెగుళ్లు, వైరస్ వ్యాప్తి చేసే తామర పురుగుల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. పంటలు విత్తుకునే సమయంలో కూడా వాలుకు అడ్డంగానే పంటలు వేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల భూమిలో తేమ శాతాన్ని పెంపొందిచ్చవచ్చన్నారు. ప్రధాన పంటతో పాటు రెండు, మూడు అంతర పంటలు వేసుకోవడం వల్ల కూడా తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుందన్నారు. పొలం చుట్టూ కందకాలు తవ్వుకోవడం ద్వారా వర్షపు నీటిని ఎక్కడికక్కడే ఇంకేలా చేసుకోవడం మేలన్నారు. దీనివల్ల బెట్ట పరిస్థితులు ఏర్పడినా పంటలు కొంతవరకు తట్టుకుంటాయన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకోవాలన్నారు.



ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నుతున్న దృశ్యం



కమల్‌రాజ్, ఏవో, నల్లజర్ల మండలం

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com